క్లుప్తంగా

డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ గోపి

లేపాక్షి: మండలంలోని వివిధ కేసుల్లో రౌడీషీటర్లుగా నమోదైన వారు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్‌ఐ కే.గోపి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండల వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. అదే విధంగా మండల వ్యాప్తంగా ఉన్న ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు తీసుకెళ్లాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు తీసుకోవాలన్నారు. యూనిఫాం వేసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఓటరు జాబితా సర్వేపై శిక్షణ

అగళి: స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ జమానుల్లా ఖాన్ ఆధ్వర్యంలో ఓటరు జాబితా సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈనెల 4, 5 తేదీల్లో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సుబ్బారావు, ఆర్‌ఐ గురన్న, బూత్ లెవెల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆచూకీ లభ్యం



మహిళను తహసీల్దార్ ఎదుట హాజరుపరచిన పోలీసులు

పెనుకొండ రూరల్: మండలంలోని గొందిపల్లి గ్రామానికి చెందిన కుమారి అనే మహిళ అదృశ్యమైనట్లు నాలుగు రోజుల క్రితం భర్త రాము ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బుధవారం సదరు మహిళ పెనుకొండలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ సురేష్ ముందు హాజరుపరిచినట్లు కియా ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

జూదరుల అరెస్ట్

మడకశిర: మండల పరిధిలోని బుళ్లసముద్రం గ్రామ సమీపంలో బుధవారం జూద కేంద్రంపై దాడి చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. ఈ దాడిలో ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి, రూ.10,370 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

చిలమత్తూరు: మండలంలోని హుస్సేన్ పురం సమీపంలో బుధవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.23,530 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపిక




ఉపాధ్యాయులతో విద్యార్థి జే.ప్రదీప్

లేపాక్షి: మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జే.ప్రదీప్ రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జీఎన్.ప్రకాష్, ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్ బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల అనంతపురం బాలుర జూనియర్ కళాశాలలో అండర్-17 జిల్లా స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో జే.ప్రదీప్ సత్తా చాటి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలి

హిందూపురం అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని 21 వార్డు మోతుకపల్లిలో ఉన్న డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. డంపింగ్ యార్డుకు కొందరు ఆకతాయలు నిప్పు పెడుతుండటంతో దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

చేనేపల్లిలో వాల్మీకి జయంతి



జ్యోతులు మోస్తున్న మహిళలు

చిలమత్తూరు: మండలంలో వాల్మీకి జయంతి వేడుకలు కొనసాగుతున్నాయి. బుధవారం మండలంలోని చేనేపల్లిలో వాల్మీకులు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు జ్యోతులు మోసి తమ ఆరాధ్య దైవం వాల్మీకి మహర్షికి సమర్పించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వాల్మీకులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం వెలకట్టలేనిది



పెనుకొండలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



హిందూపురంలో నివాళులర్పించిన సమన్వయకర్త టిఎన్.దీపిక



మడకశిర పట్టణంలో..

పెనుకొండ: ఆంధ్రప్రదేశ్ కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ కొనియాడారు. పట్టణంలోని సెంట్రల్ స్కూల్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు అమూల్యమన్నారు. తెలుగు ప్రజలకు పొట్టి శ్రీరాములు కలకాలం గుర్తుంటారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ బోయ సునీల్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ నరసింహ, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పించారు.

లేపాక్షి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ జయసింహరాజు ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆంధ్ర రాష్ట్రం అవతరించడానికి ఆయన చేసిన కృషిని వివరించారు.

పెనుకొండ: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం వెలకట్టలేనిదని హైకోర్ట్ న్యాయవాది శివరామకృష్ణ, పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలుగు తల్లి విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవిశెట్టి రామన్న, ప్రతాప్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్‌బాబు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. అమరజీవి ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలన్నారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీ.గురుబ్రహ్మ సిబ్బంది పాల్గొన్నారు.

గుడిబండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం ఆంధ్రరాష్ట్రం అవతరించడానికి ఆయన చేసిన కృషిని వివరించారు. పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతో మనకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు.

గోరంట్ల: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాం నాయక్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి జోహార్లు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రఘునాథగుప్త తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని సచివాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మడకశిరలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ సుభద్ర, మాజీ ఎంపీటీసీ నాగేంద్ర, మాజీ కౌన్సిలర్ నారాయణప్ప, సచివాలయ కన్వీనర్ అంజలి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో నడుద్దాం

హిందూపురం: ఆంధ్రప్రదేశ్ కోసంఅమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన త్యాగాన్ని తెలుగు ప్రజలు ఎన్నాడూ మరవలేరని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్ దీపిక అన్నారు. బుధవారం స్థానిక చిన్న మార్కెట్ సర్కిల్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను మేటిగా నిలిపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పొట్టి శ్రీరామలు స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పథకాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు ఆసిఫ్, నాగేంద్రమ్మ, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, బీ బ్లాక్ కన్వీనర్ నరేష్, కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, రవీంద్రుడు, శ్రీనివాసులు, వెంకటేష్ రెడ్డి పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక చిన్నమార్కెట్‌లోని అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టిశ్రీరాములకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జీపీకే రాము, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రవీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



అమరాపురంలో..



పెనుకొండలో మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు



చిలమత్తూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జోహార్లు అర్పిస్తున్న దృశ్యం



లేపాక్షి గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి..



హిందూపురంలో ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో..



గుడిబండలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



గోరంట్ల మండల పరిషత్ కార్యాలయంలో..

నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యం



పెనుకొండలో మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



హిందూపురంలో హెల్త్ కిట్లను పంపిణీ చేస్తున్న పార్టీ సమన్వయకర్త టిఎన్.దీపిక

పెనుకొండ: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద దర్జీపేట స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇళ్ల వద్దకే వైద్య సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. పలువురికి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో భరోసా

హిందూపురం: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా లభిస్తుందని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కురుబ టిఎస్.దీపిక అన్నారు. బుధవారం మున్సిపాల్టీ పరిధిలోని 13వ వార్డు ఇందిరానగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో వైద్య శిబిరం జరిగింది. అలాగే 24వ వార్డు నింకంపల్లి అర్బన్‌హెల్త్‌సెంటర్ వద్ద జరిగిన వైద్య శిబిరానికి కౌన్సిలర్ నాగేంద్రబాబు, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమన్వయకర్త టిఎన్ దీపిక మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం కొనసాగాలన్న మరింత అభివృద్ధి సాధించాలన్న మళ్లీ జగనన్న సీఎంగా రావాలన్నారు. అనంతరం ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అర్హులైన వారికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు అసీఫుల్లా, నాగేంద్రమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, శ్రీకాళహస్తి ఆలయ కమిటీ సభ్యుడు రవీంద్రుడు, బీబ్లాక్ కన్వీనర్ నరేష్, నాయకులు ఫరూక్, సుభాష్‌గాంధీ, శ్రీనివాసులు, జబివుల్లా, చోటూ, ఇనాయతుల్లా, మహిళ కన్వీనర్ సహేరాబాను, భారతి పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం

గోరంట్ల: మండల పరిధిలోని దిగువ గంగంపల్లి తండాలో రూ.5 లక్షల మండల పరిషత్ నిధులతో బుధవారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాం నాయక్ ప్రారంభించారు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సిమెంట్ రోడ్డు నిర్మించాలని గంగంపల్లి తండా ప్రజలు ఎమ్మెల్యే శంకరనారాయణకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే.. వెంటనే మండల పరిషత్ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథగుప్త, నాయకులు వెంకటకృష్ణా రెడ్డి, వాసుదేవరెడ్డి, బయపరెడ్డి, శ్రీనివాసనాయక్, సచివాలయ ఇంజినీర్లు పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

ఉపాధి పనులు వేగవంతం చేయండి

రొళ్ల: మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేసి కూలీలందరికీ పనులు కల్పించాలని సీఎల్ఆర్సీ కోర్సు డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల పని పూర్తి చేసుకున్న వారిని గుర్తించాలన్నారు. వారికి వచ్చే వారం నుంచి పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో రైతులు, కూలీలకు ఉపయోగపడే పనులను చేపట్టి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఎండ అధికం ఉన్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం సమయంలో పనులకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. 6,233 జాబ్ కార్డులు ఉండగా.. 174 జాబ్ కార్డుల కూలీలు మాత్రమే వంద రోజుల పని పూర్తి చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు కూడా వంద రోజులు పూర్తి చేసుకునే విధంగా చూడాలన్నారు. పనులు కల్పించంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. రైతుల పొలాల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఓబులేసు, సీఓలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎల్ఆర్సీ కోర్సు డైరెక్టర్ లక్ష్మీనారాయణ

రొద్దం: స్థానిక ఎంపీడీఓ కార్యాలంలోని సమావేశ భవనంలో బుధవారం గ్రామీణ జాతీయ ఉపాధి పనులపై సమావేశం నిర్వహించారు. ఏపీఓ హారున్ రషీద్ మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు కల్పించాలన్నారు. కూలీల సంఖ్య పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈసీ ఈరన్న, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

త్వరలో పావగడకు తుంగభద్ర జలాలు

పావగడ: ప్రతి ఒక్కరూ కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలి. త్వరలో పావగడకు తుంగభద్ర తాగు నీరు ఇస్తామని ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేష్ అన్నారు. స్థానిక క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఆంధ్ర సరిహద్దులో ఉన్న పావగడలో కన్నడ భాష కంటే తెలుగు భాష ఎక్కువగా మాట్లాడతారన్నారు. దీంతో తాను కూడా తెలుగులో మాట్లాడి తోటి విద్యార్థులు, అధ్యాపకుల ఎదుట అభాసు పాలయ్యే వాడినన్నారు. రెండేళ్లలోపు రైలు బండిని నడిపిస్తామన్నారు. ప్రధాన వక్త రాఘవేంద్ర మాట్లాడుతూ కన్నడ భాష బతకాలంటే ప్రతి ఒక్కరూ కన్నడ భాషలోనే మాట్లాడాలన్నారు.

అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన 20 మంది వ్యక్తులకు కన్నడ రాజ్యోత్సవ పురస్కారాలు అందించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, శంకరరెడ్డి, ఎగువ పల్లి నాని తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



కన్నడ రాజ్యోత్సవ పురస్కారాలు అందుకున్న వారితో ఎమ్మెల్యే వెంకటేష్

పురస్కార గ్రహీతలు వీరే..

సాహిత్యంలో కరియణ్ణ నిషాధ్, ప్రేమ జ్యోతి, జానపద రంగంలో డి నాగరాజు, ఎన్ మరిస్వామి, క్రీడల్లో బి.శ్రీనివాస్, ఎం గిరీశ్, నాటక రంగంలో డీటీ నరసింహమూర్తి, సమాజ సేవలో పూజారప్ప, శశికళ, విసి పురుషోత్తమ రెడ్డి, రమేశ్ బాబు, కే నాగరత్నమ్మ, పారిశుధ్య కార్మికులు నరసింహప్ప, మారక్క అందుకున్నారు. పత్రికా రంగంలో ఫాస్టిన్ మైకేల్ ప్రదీశ్, మల్లికార్జున, కే.ఆర్ జయసింహ, గడినాడు కన్నడ సేవలో రామయ్యనపాళ్య కన్నడ రాజ్యోత్సవ వేదిక, పార్యంపర వైద్యుడు జీఎస్ బసవరాజు పురస్కారాలు అందుకున్నారు.

వివరాలు యాప్‌లో నమోదు చేయండి

అమరాపురం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను తప్పనిసరిగా సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు యాప్‌లో వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 నుంచి 21 సంవత్సరాల్లోపు పౌరుల వివరాలను సేకరించి వాటిని వైఎస్సార్ ఆరోగ్య శ్రీ యాప్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే వాహన మిత్ర, అమ్మ ఒడి, వైఎస్సార్ నేతన్న నేస్తం, తదితర వివరాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. వాటిని సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సచివాలయంలో వివిధ శాఖల అధికారులు పరిష్కరించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

హిందూపురం టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల అనంతపురంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఎంజీఎం పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. అండర్-17 విభాగంలో బి.జయశ్రీ, బి.నందిని, బాలుర విభాగంలో టీజీ ఉదయ్‌కుమార్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అలాగే అండర్-14 విభాగం బాలికల్లో బి.యామిని, బాలురలో పీ.ఖాశీంషా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీడీలు లోక్‌నాథ్, సురేష్, విలియమ్ శేఖర్, రాణి, ప్రవీణ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు

మడకశిరరూరల్: మండలంలోని హరేసముద్రం, గొల్లపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ మూర్తి బుధవారం తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డ్రైనేజ్, సీసీ రోడ్లు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఎమ్మెల్యే తిప్పేస్వామికి విన్నవించారని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా డ్రైనేజ్, సీసీ రోడ్లు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగా డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. ప్రభుత్వం గ్రామ సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి జరుగుతుందన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

రొద్దం: మండల పరిధిలోని పెద్దకోడిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి వాల్మీకి జయంతి వేడుకల్లో భాగంగా వాల్మీకి విగ్రహ ఊరేగింపులో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. నాగేంద్ర అనే వ్యక్తిపై లింగం అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన నాగేంద్రను చికిత్స నిమిత్తం పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

అన్నదానం

హిందూపురం టౌన్: నిరంతరం ధర్మం కోసం, దేశం కోసం పోరాడుతున్న పరిపూర్ణానంద స్వామిజీ జన్మదినం సందర్భంగా బుధవారం చిన్న మార్కెట్ సర్కిల్‌లో హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కేవీ చలపతి, రమేష్‌రెడ్డి, మేడికుర్తి హరిలు పాల్గొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో హిందూ ధార్మిక సంస్థల నాయకులు జగదీష్, రామాంజనేయులు, జనార్దన్, బాబు, నాగరాజు, మాధవ, మనోజ్, చంద్ర, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

మడకశిరరూరల్: చెందకచెర్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవాలానాయక్ కుమార్తె, చెందకచెర్లు సర్పంచ్ ప్రభావతిబాయికి చాణిక్యనాయక్‌తో బుధవారం ఆంజనేయస్వామి ఆలయంలో వివాహం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి దంపతులు, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి నర్సేగౌడు తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకరరెడ్డి కుమార్తె హర్షితరెడ్డి వివాహ రిసెప్షన్ బుధవారం స్థానిక రాజ్‌ఫంక్షన్‌హాల్‌లో జరిగాయి. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరై వధూవరులు హర్షితరెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డిని ఆశీర్వదించారు.

ఇంట్లో చోరీ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని సాయినగర్‌లో తాళాలు వేసి ఉన్న ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. ఇంటి యజమాని తిమ్మక్క వారం రోజుల క్రితం రొళ్ల మండలంలోని కుతూరి ఇంటికి వెళ్లింది. బుధవారం ఇంటికి వచ్చే సరికి.. అప్పటికే తాళాలు తీసి ఉండటం గమనించింది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా రూ.20 వేలు విలువైన బంగారు చెవికమ్మలు, రెండు వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు వాపోయింది. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుడిబండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రాధమ్మ, ఎంపీడీఓ రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అధికారులు తమ పూర్తి ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. అలాగే జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పకుండా హాజరుకావాలని కోరారు.